జగన్నాథం

'నాగరంజని'

తహసీల్ ఆఫీసునుంచి రెండుమైళ్ళు చచ్చి–చెడి నడిచి యిల్లు చేరగానే తలుపు గడియవేసి ఉండడంతో "సీతా-సీతా" అంటూ కేకేసాను.

'ఆఁ వస్తున్నా–నాన్నా' అంటూ దూరంగా లోపలి గదిలోంచి వినిపించింది సీత కంఠం.

సీత తలుపు తీయడంతోనే చేతిలోని గొడుగు నందుకుంది. ఎండలోంచి ఒక్కసారే నీడలోకి రావడంతో కళ్ళకేమీ కనిపించడం లేదు. చీకటిగా ఉంది.

ఎలాగో ఓలాగు వెళ్ళి చేతులు విరిగిన కుర్చీలో చేరగిల బడ్డాను. ఒకటే ఉక్కగా ఉంది. భుజంమీది కండువాతో ముఖం ఒకసారి గట్టిగా తుడుచుకొని 'అమ్మా సీతా! కాసిన్ని చల్లటి మంచి నీళ్ళు తెచ్చిపెట్టమ్మా." అంటూండగానే మౌనంగా వంటింట్లోకి వెళ్ళింది సీత

'ఇదిగో నాన్నా మజ్జిగ' అన్న సీత గొంతుతో కళ్ళువిప్పి చూశాను. ఎదురుగా సీత ఉదాసీనంగా ఉంది. ఎప్పుడూ చిరునవ్వుతో ఉండే సీత ముఖంలో ఉదాసీనత కొట్టవచ్చినట్లు కనిపించింది.

"ఏమమ్మా! అలా ఉన్నావ్. ఏమయింది. ఉఁ" అని అను నయంగా అడిగాను. కాస్త బ్రతిమాలించుకొని చెప్పింది. "జగన్నాథం మామయ్య బట్టల కొట్టులోంచి మనిషొచ్చాడు. నానా మాటలు అని పోయాడు. డబ్బులు కట్టలేనివాళ్ళు బట్టలెందుకు తీసుకోవాలి. సీజన్ అంతా అయిపోవచ్చింది. యింకా ఎప్పుడు కడతారు. అనవసరంగా మమ్మల్ని యింటి చుట్టూ తిప్పించుకొనడం దేనికి...యింకా నానామాటలు అన్నాడు."

సీతకు అభిమానం కాస్త జాస్తి. దాంతో బాధపడుతుంది. "అంతేనా అమ్మా! నేను సాయంత్రం వెళ్ళి మామయ్యతో కలుస్తాలే" అన్నాను.

జగన్నాథానికి బట్టల తాలూకు ఐదువందలు, పార్వతి పెళ్ళికి అర్జంటుగా తీసుకున్న వేయిరూపాయలు, యింకా యివ్వనేలేదు. అది తీర్చేమార్గం కనిపించడం లేదు. ఆలోచనలతో బుర్ర వేడెక్కింది. అప్పు సంగతి ఎలాఉన్నా జగన్నాధాన్ని కలవక చాలా రోజులయింది. వెళ్ళి ఒకసారి కలవాలనిపించింది.

సాయంత్రం ఎండకాస్త చల్లబడింది.

జగన్నాథం తీరిగ్గా కూర్చొని పేపరు చూస్తున్నాడు. "ఏమిటోయ్ యీమధ్య కనిపించడం మానేశావ్. నిన్నసాయంత్రం–యివాళ ప్రొద్దున కూడా మీ యింటికొచ్చాను." అంటూ ఆదరంగా పలకరించాడు.

"నీకు తెలియంది ఏముంది సీజన్‌గా యిది. తహసీల్ వసూలుకై పల్లెటూళ్ళు కెళ్ళాను. నేడే పదిగంటల కొచ్చాను. రావడంతోటే మళ్ళా ఆఫీసు కెళ్ళాను." అంటూ కూర్చున్నాను.

కాస్సేపదీయిదీ మాట్లాడి బాదమ్ మిల్క్‌కు ఆర్డరిచ్చి "అన్నట్లు అసలు విషయం చెప్పడం మరిచాను. మన మందరం కలిపి ఒక టూర్ ప్రోగామ్ వేసుకుందాం. ఆ విషయం అడగటానికే మీ యింటి కొచ్చాను. ఏమంటావ్ ?" అని అడగడంతో, ఏం జవాబు చెప్పాలో తెలియక నవ్వి "మనం ప్రతియేడు అనుకునేదేగా ! బాగానే ఉంటుంది. కాని... అని ఆగిపోయాను."

"కాని ఏమిటోయ్ ! వెళదాం అంటావా. ఆ పురుషోత్తమ్, సుదర్శనం, విశ్వం ఒకటే పోదాం–పోదాం అంటున్నారు. నీవుచెప్పు. నీవు వెళదాం అంటే వెళదాం. లేకపోతే లేదు. నీవు లేకపోతే మా కంత హుషారుగా ఉండదు. అదీగాక మన కారును పదిహేడు వందలు పెట్టి రిపేర్ చేయించాను. ఫస్టుక్లాస్‌గా తయారయింది. దాంట్లోనే వెళదాం. డబ్బుగురించి నీవాలోచించకు. ఏం ?" అంటూ గ్లాస్ అందించాడు.

బాదమ్ మిల్క్ త్రాగుతుంటే ఒకసారి సీత, మధ్యాహ్నం

అన్నమాటలు గుర్తొచ్చాయి. జగన్నాథం ముఖంలోకి పరికించి చూసాను. నిర్మలంగా ఉంది. ఆ మాటలు అతను అనిపించలేదని పించింది. ఎండలో తిరిగి విసిగి వాడే అని ఉంటాడు.

ఎలాగయితేనేం వారంరోజుల తరువాత ఐదుగురం కలసి బయలుదేరాం. నేను, జగన్నాథం, పురుషోత్తం, సుదర్శనం, విశ్వం, డ్రైవర్‌వెంట రావడం వీలు పడలేదు. కారు పాత కాలంది చిన్నది. ఇప్పుడది బాగానే నడుస్తోంది. పోతే కాస్త చప్పుడెక్కువ. అంతే. మొదట మా దర్శనీయ స్థలం అజంతా ఎలోరా.

మధ్యాహ్నం వేళకలా 'బీదర్' మీదుగా ఔరంగాబాద్ చేరుకున్నాం. ప్రొద్దున ఎప్పుడు తిన్నామో ఆకలి దంచేస్తోంది. కాస్త పెద్ద హోటల్లోకే చొరబడ్డాం. జగిన్నాథం ఏమేమో ఆర్డర్ యిస్తున్నాడు. మటన్, ఫ్రై చికెన్ యింకా ఏమేమో. అందరం తృప్తిగా భోంచేసాం. బిల్లు అరవై ఐదు రూపాయలయింది. బిల్లు జగన్నాథమే తీసుకున్నాడు.

అందరికీ భుక్తాయాసంగా ఉంది. పాన్ నమిలితే బాగుం డనిపించింది. అందరం పాన్‌షాప్‌వైపు కదిలాం.

"పాంచ్‌పాన్ బనావో భై"

పాన్‌షాప్‌వాడు ఒక్కొక్క పాన్‌కట్టి పెడుతున్నాడు పదిలంగా.

'కిత్‌నే పైసే' అడిగాడు జగన్నాథం చిల్లర తీస్తూ.

నలభై పైసలన్నాడు పాన్‌వాలా– అంతే! జగన్నాథంలోని రెండవ మనిషి—నాకింతవరకు అర్ధంకాని మనిషి మేల్కొన్నాడు.

"క్యాభై. సాత్‌పైసేకో ఏక్ పాన్ నా?

"నహీసాబ్! ఆఠ్‌పైసేకో ఏక్-జుమ్‌లా చాలీస్‌పైసే."
అంటూ ఐదుపాన్లు అందించాడు.

"కమాల్ హై యార్! నహీహోనా" అంటూ పాన్లు తీసుకోకుండా ముందుకు కదిలాడు.

జగన్నాథంలోని యీ మనస్తత్వమే నాకర్ధం కాదు. హోటల్ బిల్లు అరవయ్యయిదు రూపాయలు చెల్లించిన మనిషి పాన్‌షాప్‌వాడితో ఐదు పైసలకు పేచీ పడ్డాడు.

అరగంట తిరిగి ఒక డొక్కు షాపులో ఏడుపైసల కొకటి చొప్పున పాన్లు తీసుకొని బుగ్గన బిగించాం. అప్పటికే మా భుక్తాయాసం పూర్తిగా తీరిపోయింది.

తెల్లవారి ఎల్లోరాకని మా కారులో బయలుదేరాం. ఊరు దాటుతుంటే కారు ఫెయిలయింది. అది ఎక్కడో ఒకచోట యిలా మధ్యంతరంగా మమ్మల్ని ముంచుతుందని నాకు ముందే తెలుసు. అలా అంటే జగన్నాథం చిన్నబుచ్చుకుంటాడని ఏమీ అనలేదు. ఎలాగో అందరం కలసి దాన్ని మెకానిక్ షాప్‌లో పడేసి మేం బస్సులో ఎల్లోరా బయలుదేరాం.

సాయంత్రం తిరిగొచ్చాక కాలక్షేపం ఎలాచెయ్యాలో తోచక దగ్గర్లో ఉన్న విఘ్నేశ్వరుని గుడికి వెళ్లాం. గుళ్లోకి వెళ్లేముందు అందరు పూలు—పండు కొబ్బరికాయ తదితర పూజాసామగ్రి కొన్నాం. పూజ సామాను కొంటుంటే విశ్వం దగ్గర చిల్లరలేదు. జగన్నాథాన్నడిగి రెండు రూపాయల ముప్ఫై పైసలు అప్పుతీసుకున్నాడు. పక్కలోఉన్న రోల్డ్‌గోల్డ్ నగల దుకాణంలోకి దారి తీశాడు జగన్నాథం. వద్దన్నా వినకుండా సీతకోసమని ఒక నెక్లెస్, నాలుగు గాజులు కొన్నాడు.

అందరం అర్చన చేయించాం. పూజారి హారతి యిస్తుంటే— పళ్ళెంలో చేతికి వచ్చిన నాణెం వేసాం. కాని జగన్నాథం జేబులోని చిల్లర చేతిలోకి తేసుకుని ఏదో నాణెంకోసం వెదుకుతున్నాడు. అతనికి కావలసింది దొరకలేదు. యింకో జేబు వెదికాడు.

జగన్నాథంలో మళ్లీ నా కర్ధంకాని మనిషి మేల్కొన్నాడు.

చివరకు చేతిలోగల చిల్లర మొత్తంలోంచి చిన్న మొత్తం రెండు పైసలు హారతి పళ్ళెంలోవేసి మా అందరికన్న భక్తిగా హారతి కళ్ళ కద్దుకున్నాడు.

గుడి బయట-మెట్లకిరువైపుల బిచ్చగాళ్ళు బారులుతీర్చి హృదయ విదారకంగా అరుస్తున్నారు. ఆ అరుపు వారికి అలవాటయినట్లుంది. హృదయాలను కదిలించే ఆర్తనాదాలకు ముఖకవళికలకు ఎక్కడా పొత్తు కుదరటంలేదు.

ఒక కుర్రాడు అన్నీ నయాపైసలే చిల్లర యిస్తున్నాడు. రూపాయికి తొంభై పైసలు. వాడి దగ్గర చిల్లర తీసుకుని వాళ్లకు

వేశాము. కాని జగన్నాథం చిల్లర తీసికోలేదు. అందరికి వేయడంలేదు. కుంటివారికి, గుడ్డివారికి, పండుముసలి వాళ్ళకి తనకు తోచినన్ని పైసలు వేస్తున్నాడు. మాలాగ చిల్లర పైసా పైసా వేయడంలేదు.

ఒకచోట ఒకడు ముళ్ళకంపలో పడుకొని తలను పూర్తిగా మెడవరకు మట్టితో మెత్తేసుకుని ఛాతీ చరుచుకుంటున్నాడు. వాడి ముందరిపళ్ళెం చిల్లరతో నిండిపోయింది.

నేను ఒక్కక్షణం ఆగిపోయాను. జగన్నాథం కనీసం వీడికి అర్ధరూపాయి బిళ్ళయినా వేస్తాడనిపించి నేను పదిపైసలు వేశాను. నా వెనకనున్న జగన్నాథాన్ని గమనిస్తూ.

నేను అనుకున్నట్టుగా జగన్నాథం అర్ధరూపాయి కాదు గదా ఒక్కపైసా కూడ వేయలేదు.

మరునాటికి కూడ మా కారు రిపేరు అవలేదు.

బస్సులోనే అజంతా వెళ్ళాం. నా ఖర్చులన్నీ జగన్నాథమే భరిస్తున్నాడు. అడపా దడపా అందరి బిల్సూ కడుతున్నాడు.

అజంతా రెండు రోజులు చూసాం.

మా కారు రిపేరయింది. అయినా దాన్నినమ్ముకుని ముందుకు ప్రయాణం చేయాలనిపించలేదు ఎవ్వరికీ. అందుకని వెనక్కి మళ్ళాం.

మిట్టమధ్యాహ్నం—ఒంటిగంటవేళ. ఏప్రిల్ ఎండలు మండిపోతున్నాయి. మా కారుముందు ఓ కుర్రాడు వయస్సు పాతిక ఉండొచ్చు. భుజానికి ఎయిర్‌బాగ్ చేతిలో సూట్‌కేస్‌తో నడుస్తున్నాడు నీరసంగా. జగన్నాథం కారుకాస్త స్లోచేసి కుర్రాడి క్కాస్త ఎడంగా నడిపిస్తూ "ఏమిటోయ్ పగలనుకున్నావా? రాత్రనుకున్నావా? లేక వెన్నెల షికారా!"

అంత నీరసంలోను జగన్నాథం మాటలకు చిరునవ్వు నవ్వాడా అబ్బాయి. "వెనక స్టేజీలో ఒక్క బస్సూ ఆగడంలేదు. ప్రొద్దుట్నించి పడిగాపులు కాస్తున్నా. కనీసం ముందర స్టేజిలో నయినా ఆగుతుందేమోనని..." అని అర్ధాంతరంగా ఆగిపోయాడా అబ్బాయి.

జగన్నాథం "కమాన్ కూర్చో" అంటూ తలుపు తెరిచాడు. కుర్రాడు సామాను చేరవేసి—యిరుకుగా ఉన్నా ఎలాగో సర్దుకుని కూర్చున్నాడు.

కుర్రాడు కూర్చున్నది మొదలు ఏదో ఒకటి చెపుతూనే ఉన్నాడు. మూడేళ్ల నిరుద్యోగం తర్వాత అష్టకష్టాలు పడ్డాక ఉద్యోగం దొరికిందట. రేపే వెళ్ళి జాయిన్ అవ్వాలట. యింకా ఏమేమో చెప్పకు పోతున్నాడు.

కుర్రాడు చేరాల్సిన స్టేజీ వచ్చింది.

స్టేజీ దగ్గర మూడు బస్సులకు సరిపడ్డ మంది పడిగాపులు గాస్తున్నారు. జగన్నాథం అక్కడ కారు ఆపలేదు. కుర్రాడ్ని దింపలేదు.

కారు ఒక్కొక్క మైలురాయే దాటుతోంది. మూడు గంటల తర్వాత ఆదిలాబాద 0 కి. మీ. దగ్గర కారు టక్కున ఆగిపోయింది.

"అబ్బాయి ఆదిలాబాదలో దిగాలన్నావ్‌గా వచ్చేసింది" జగన్నాథం గొంతులో దిగు అన్న అర్థం ధ్వనించింది.

"ఇక్కడెలాగండి దిగేది? యిక్కడ ఓ రిక్షా లేదు. కనీసం కూలివాడు కూడా లేదు. ఎలా వెళ్ళేది ఊళ్ళోకి." అబ్బాయి పూర్తిగా నీరసించిపోయాడు.

"చూడబ్బాయి! ఇది ఆర్. టి. సి. బస్సుకాదు. నీ కారు అంతకన్నాకాదు నీ వనుకున్నచోట దింపటానికి. పెట్రోలు ధరలు అగ్గిలా మండిపోతున్న ఈ రోజుల్లో. కమాన్ తొందరగా దిగు. యింకా మేం ముందుకు పోవాలి."

"ప్లీజ్‌సార్! యింత లగేజ్ మోయలేను. ఏ లాడ్జింగ్ దగ్గరయినా వదిలిపెట్టండి అని దీనంగా అడిగాడు. అయినా జగన్నాథం కాదు కూడదని అక్కడే దింపేసాడు.

నలభై మైళ్లు లిఫ్టు యిచ్చిన జగన్నాథం ఈ కాస్త దూరం తీసికెళ్ళడానికి ఎందుకంత కఠినంగా ప్రవర్తించాడో అర్థం కాలేదు నాకు.

కారు మళ్ళీ కదిలింది.

ఒక్కొక్కరినే యిళ్ల దగ్గర దింపుతున్నాడు. విశ్వం యిల్లు వచ్చేసింది. విశ్వం దిగిపోతుంటే విఘ్నేశ్వరాలయం దగ్గర తీసుకున్న చిల్లర జ్ఞాపకం చేయడంతోనే చటుక్కున తీసి యిచ్చేశాడు విశ్వం.

కారు మా యింటి ముందుకి చేరుకుంది. నేను దిగిపోయాను. జగన్నాథం సీతకోసం కొన్న నెక్లెస్ గాజులు తీసియిచ్చాడు. నన్ను కూడ డబ్బడుగుతాడనుకొని జేబులో చేయిపెట్టాను. "జగన్నాథం మామయ్య యిచ్చాడని చెప్పు. వస్తా!" అంటూ కారు స్టార్టు చేసాడు. కారు కనుమరుగైంది.

జగన్నాథం చిత్రమయిన మనిషి.